# స్వప్న వాసంతం

"ఆడదంటే యింత గౌరవంలేనివాడివి నన్నెందుకు పెళ్ళాడావు? నాలాంటిదాని ఉసురు తగిలితే నీకు మటుకు ఎక్కడిది సౌఖ్యం?" రాబోయే ఏడుపుతో కంఠం కంపించి పోతూంటే ఇంకా ఏవేవో అనాలన్న కుతూహలం మాటలని పెగలనీయకుండా చేస్తూంటే గట్టిగా అడిగింది పార్వతి.

"పక్కింటివాళ్లు వింటారు మెల్లిగా మాట్లాడు పార్వతీ" పేపరులోంచి తలేనా ఎత్తకుండా అన్నాడు కృష్ణమూర్తి.

"వింటే విననీ, తప్పేముంది? అందరికీ నువ్వు మంచివాడివే. అందరికీ నేను గయ్యాళినే...నాకెన్నిసార్లు ప్రామిస్ చేశావు. "సెకండ్‌షో సినిమాకి వెళ్ళను, అందులోనూ యింకో ఆడదాన్ని తీసుకుని"—అని? అన్నీ మరచిపోయి రాత్రి రెండుగంటలకి యిల్లుచేరితే యిదేం యిల్లా? ఈలోగ నాపీక ఎవరేనా నొక్కినా దిక్కేది?

"అదేమిటి పార్వతీ. ఎవరేనా వింటే నవ్వుతారు. ఇంకో ఆడదేమిటి? సినిమా ఏమిటి? నేను సినిమాకి వెళ్ళలేదు, వసంత వెళ్ళిందని చెప్తే ఇంటికి దిగబెట్టి రావడానికే ఆ టైంకి వెళ్ళాను. నిజం చెప్తే నమ్మవెందుకు పార్వతీ! ఇలా

అయితే ఎలాగచెప్పు?" అనునయం ఉట్టిపడే గొంతుకతో అన్నాడు. ఆ స్వరం మరీ కోపం తెప్పించింది పార్వతికి.

"నిన్ను నమ్మే యిక్కడిదాకా వచ్చాను. మనిద్దరం యిలా అస్తమానూ దెబ్బలాడుకుంటూ వుంటే, నువ్విలా అర్ధరాత్రి అపరాత్రి స్నేహితురాళ్ళని యిళ్ళకి దిగబెట్టడానికి వెళ్ళి వస్తూంటే, నానిగాడు ఎలా తయారవుతాడో - ఆలోచనేనా లేదు నీకు సరికదా, నేనేదో గయ్యాళినని విరుచుకు పడతావు. వాడు ఉట్టి వెధవగా తయారయితే, "తల్లి పెంపకం" అంటారు అందరూ. అంతేకాని, అందులో నీవాటా తొంభైతొమ్మిది పాళ్లు అని ఎవరికి తెలుస్తుంది?... అయినా నీ ధోరణేం నచ్చలేదు నాకు."

"పోనీలే పొద్దున్నే చూసుకుందాం. నిద్రపో; రెండున్నరా మూడవుతోంది" అంటూ కృష్ణమూర్తి అప్పటిదాకా అడ్డుపెట్టుకున్న పేపరు మడిచి కుర్చీలోంచి లేచాడు.

ఏడవకూడదన్న తాపత్రయంతో గంభీరంగా ముఖం పెట్టుకుని పార్వతి నడుంవాల్చింది కాని, కృష్ణమూర్తి కంఠం కౌగలించుకొని గట్టిగా ఏడ్వాలనుంది.

కాని పౌరుషం! ఆధునిక యుగంలో అన్ని జబ్బులకి తోడు, యీ పౌరుషం జబ్బొకటి!

చదువు సంధ్యలు యింకేసదుపాయాలూ కల్పించక పోగా, యీ కుళ్ళి కుళ్ళి లోపల ఏడ్చే గుణాన్ని పెంచాయి.

4)

హాయిగా ప్రియభర్త కళ్ళెదుట ముఖాన కొంగు కప్పుకొని ఏడిస్తే హృదయం తేలిక పడుతుంది.

మబ్బులా విడిపోయి సాంసారిక జీవితం ప్రశాంతంగా వుంటుంది. అదే చేతకాదు. అందుకే, ప్రతి చిన్నవిషయానికీ లోపల బాధపడ్డం, పైకి గంభీరంగా ముఖం పెట్టడం.

ఈ ద్వంద్వవ్యక్తిత్వ ప్రదర్శనతోటే అన్నిరకాల నీరసాలూ వస్తున్నాయి. కళ్ళు మూసుకుని పడుకుందేకాని, గట్టిగా ఏడ్చేయాలని వుంది పార్వతికి, కాని పౌరుషం అడ్డుతగిలింది. "తనని తప్ప యింకోళ్ళని పెళ్ళిచేసుకోనని సంవత్సరాలు ఎదురుచూసి చివరికి తనని పెళ్ళిచేసుకున్న కృష్ణమూర్తేనా యిలా తనని బాధపెడుతున్నది? తనొక్కర్తే రెండుగంటల దాకా యింట్లో-ఒక్కర్తే వుంటే, బాధ లేదుకాని, ఎవరో అమ్మాయి రెండో ఆట సినిమానుంచి యింటికి వెళ్ళలేదని దిగబెట్టడానికి వెళతాడా? అలా అని చెప్తే ఎలా నమ్మడం? తను నమ్మితే చాలు అంటాడు. అలా అని పైకి అన్నా తను నిజంగా నమ్మలేదే! ఇలాంటి క్షోభ తనకెందుకు రాశాడు దేవుడు? ఏడాది నానిగాడు యిదంతా మొదట్లో అర్థంకాక ఏమిటా అనుకుంటాడు. కాని కొన్నాళ్ళకేనా వాడికి అర్థం కాదూ? అప్పు డేమనుకుంటాడు వాడు? ఏమిటీ అమ్మా నాన్న అనుకోరూ? అప్పుడు వాడికి తనమీద అభిమానం గౌరవం వుండమంటే ఎలా వుంటుంది?"

ఆలోచనలు పొగమంచులా అలముకొని పార్వతి కళ్ళు వర్షిస్తూనే వున్నాయి. తనకేం పట్టనట్టు, ఏ విపరీతం జరిగినా

పొద్దున్న చూచుకోవచ్చునన్నట్లు గోడ కేసి తిరిగి పడుకున్నాడు కృష్ణమూర్తి.

"పార్వతీ" అంటూ తనని దగ్గరకి తీసుకున్నా యీ ఆలోచనలు కట్టడి, కొంచెం ఉపశాంతి కల్గేది. కాని అత నలా పడుకు నేసరికి అసలే అన్నివిధాలా తా నవమానింప బడుతున్నానని బాధపడుతూన్న పార్వతి అహం ఇంకా దెబ్బతింది.

అంత వసంత క్షేమంపట్ల వెన్నలా కరిగే కృష్ణమూర్తి హృదయం తనపట్ల ఎందుకిలా వుంటుంది? మధ్య నీ వసంత ఎవరు? హాయిగా వున్న సంసారాల్లో చిక్కు సమస్యల్లా యిలాంటివాళ్లు ఎందుకు తయారవుతారు? తనకే పౌరుషం వుంటే యీ వసంత కేలాగేనా బుద్ధిచెప్పాలి. అవును. తనె లాగా గయ్యాళే. ఆ మాట కృష్ణమూర్తే అన్నప్పుడు లోకం అనుకుంటే లెక్కేమిటి? ప్రతీకార వాంఛ ప్రబలం అవు తూంటే దారితెన్నులు వెతుకుతూ పార్వతి మనస్సును సుప్తావస్థ చేరింది...

* * *

"కట్టుగుడ్డలతో మనిషిని అవతలకి పంపేయడం గౌరవం అనుకున్నావు కాబోలు! యింత చదువూ సంస్కృతీ దండగ."

"నువ్వెవరు అలా అనడానికి? నాకు చేసే అన్యాయా నికి అన్ని విధాలా చేయూతనిస్తూ. మళ్ళీ నన్నే అనడానికి వచ్చావా? అయినా, వసంతా, ఒక్క సంగతి అడుగుతాను నిజం చెప్తావా?" అడిగింది పార్వతి.

"నీలాంటి ఆడవాళ్ళుంటారంటే నమ్మేదాన్ని కాదు పార్వతీ, యిప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను. నేనూ నిన్ను నాలుగడిగి పోదామని వచ్చాను. నువ్వూ అడుగు" అంది వసంత.

"కృష్ణమూర్తికి నువ్వంటే ఎందుకంత అభిమానం? అతనికి పెళ్ళీ పెడాకులూ అయాయికదా. నీకేనా తోచద్దూ? నేనే ఏదో దేవతనని, నే లేకుంటే తనకి బతుకే లేదని, తన జీవితాన్ని పంచుకోమని వేధించి పెళ్ళిచేసుకున్నాడే. అలాంటివాడు నన్నిలా నిర్లక్ష్యం చేస్తే ఎలా వుంటుందో ఊహించలేవూ?" కళ్ళనీళ్ళు ధారాపాతంగా ప్రవహిస్తున్నాయి పార్వతికి.

ఈ హడావిడంతా చూసి నవ్వుకుంటోంది వసంత. అవును, వసంతలకి నవ్వే వస్తుంది. "స్త్రీకి యిల్లంటూ ఒకటి ఏర్పడి. దానిలో తనకి యివ్వవలసిన స్థానాన్ని భర్త యివ్వకుంటే ఎలా నారీహృదయంలో హాలాహలం రేగుతుందో వసంత కేం తెలుసు?"

"ఎందుకు నవ్వుతావు వసంతా?" అమాయకంగా అడిగింది పార్వతి.

"నవ్వక ఏంచెయ్యను నీ తెలివితేటలకి? భార్యవుంటే ఇక మొగవాడు పరాయి స్త్రీతో మాట్లాడనేకూడదా? స్నేహితులూ, ఎరుగున్న వాళ్లూ నీరాకతో పోవలసిందేనా? ఏమిటి పార్వతీ యింత అర్థంలేకుండా మాట్లాడుతావు? నువ్వే యిలా అయిపోయావంటే యిక యీమాత్రం యింగితజ్ఞానం లేనివాళ్లు ఎలా ప్రవర్తిస్తారో ఊహించుకో లేకుండా

వున్నాను...అందుకే పాపం! వీధులోకొస్తే చాలు ఆముదం ముఖాలు పెట్టేసుకుంటారు."

"అలా అంటావుగాని, యీ మొగవాళ్లు యింటిదగ్గిరా అలాంటి ముఖాలే పెడతూరేమో అని, ఎందుకాలోచించవు? కృష్ణసంగతే చూడు! వచ్చేసరికి ఎంతో సరదాగా వుంటాడు. కాని, యింట్లో ఏముందో మరి! పేపరు అడ్డుతీయడా ముఖానికి. ఒకటే పజిల్సు న్యూసుపఠనం. ఇంట్లో నానిగాడున్నాడు. నేనున్నాను. రేడియోవుంది, చూడ్డానికి కిటికీల్లోంచి కావలసినంత ప్రపంచంవుంది. మరెందుకు వీటన్నిటినీ కాదని అలా పేపర్లో తలదాచుకుంటాడు? ఇదివరలో యిలావుండేవాడా,... అన్నీ నీ మూలన్నేననీ నా నమ్మకం. నే గయ్యాళిదానన్నాడు. ఎవరేనా అలా అనకుంటే కృష్ణమూర్తి అలా అంటాడా? అది నువ్వే అని వుండాలి."

"ఛీఛీ, అలాంటి పిచ్చివాగుడు వాక్కు. ఆమాటకొస్తే ఆ మాట అతనే నాదగ్గిరా అన్నాడు."

"ఆఁ నిజంగానా! నీ ఎదురుగుండా కూడా నన్నలా అంటాడా? అందుకే యిప్పుడతని తరఫున వకాల్తా పుచ్చుకుని వచ్చావు! రాగలిగావు. ఆవునా?"

"అలా రాలేదు పార్వతీ. కృష్ణమూర్తిని ఇంటికి రావద్దన్నావుటగా? ఎక్కడికి పోతాడు? అందుకే, ఎక్కడైతే విశ్రాంతి లభిస్తుందో అక్కడికి వచ్చాడు. మనిషిని అంతగా గాయపరిచాక మళ్ళీ అతని ముఖం ఎలాగా చూడడం అందుకే పూర్తిగా అతనికి విశ్రాంతి చిక్కేలా ఏర్పాట్లు చేద్దామని

వచ్చాను. కృష్ణమూర్తికి విడాకులిస్తావా? అదే నయంకదూ యీ నరకంకంటే?"

"నువ్వేం మాట్లాడుతున్నావో నీకేమైనా తెలుస్తోందా వసంతా! విడాకు లేమిటి? యివ్వడం ఏమిటి నానిగా డేమవుతాడు? పాత మమత లేమవుతాయి?"

"మ రవన్నీ ముందే ఆలోచించుకోవలసింది. ఇప్పుడు టూ-లేట్. ఇదుగో, కృష్ణమూర్తి సంతకంతో కాగితం. అఫిడవిట్ కోర్టులో దాఖలు చేయడానికి...నీకు నా సానుభూతి... పాపం, ఇప్పుడేనా ప్రశాంతంగా ఉండి, అతన్ని హాయిగా బ్రతకనీ... నే వెళ్ళనా?"

"ఎక్కడికి? వసంతా! యింత అన్యాయానికి నువ్వే అతన్ని దించావు. కృష్ణ! ఎంత మంచివాడు. నీలాంటిదాని మాటలు విని నన్ను కాదంటాడా? కోర్టుకి వెడతాడా? నే నమ్మను. అది నీకుచ్చితం. నువ్వే అతనిచేత సంతకం పెట్టించి ఉంటావు. కృష్ణమూర్తి ఎప్పుడూ యీ పార్వతిపై అత్యాచారానికి పూనుకోడు. ఈ పార్వతి ఎంతటి వెర్రిదో, ఎంతగా అతన్ని ప్రేమిస్తుందో అతనికి తెలుసు అది నీ ఫోర్జరీ. నువ్వే అతని సంతకం పెట్టి నన్ను దడిపిస్తున్నావు-అది ఫోర్జరీ, అది ఫోర్జరీ నాకు తెలుసు."

"పార్వతీ!" చల్లని చెయ్యి తగిలి ఫులిక్కిపడి లేచింది పార్వతి. ఎదురుగా కృష్ణమూర్తి. అపూర్వాగా తన ముఖం లోకి చూస్తున్నాడు. "ఏం పార్వతీ ఏమిటి! కలవరిస్తున్నావు? కలగాని వచ్చిందా? ఛీ" అంటున్నాడు.

సిగ్గుతో పార్వతి ముఖం ఎర్రపడింది. ఇప్పటిదాకా తన కల! ఏమిటీ వింతవూహాలు తనకి! ... తన కలకి తనకే నవ్వొచ్చింది.

"టైమెంతవుతుంది కృష్ణా?" మృదువుగా అడిగింది. హమ్మయ్యా అనుకున్నాడు కృష్ణమూర్తి. 'మళ్ళీ మామూలు పార్వతే' అని అతని ధైర్యం. లేచి టైం చూశాడు. నాలుగవుతోంది. "ఇంకా పడుకోవచ్చు తెల్లారుఝాము అవుతోంది" అన్నాడు మళ్ళీ పడుకుంటూ.

పడుకుంటూన్న కృష్ణమూర్తి తల తన హృదయానికి హత్తుకుంటూ అడిగింది పార్వతి "తెల్లవారుఝామున వచ్చిన కలలు నిజం అవుతాయి అంటారు, నిజమేనా?"

కృష్ణకి తెలుసు పార్వతి కలలు. పిచ్చికలలు. కలత పెట్టి గాభరా పెట్టేసే కలలు, అందుకే అన్నాడు. "చెడ్డకలవస్తే మంచి అవుతుంది. మంచికలవస్తే చెడు అవుతే అవుతుంది, లేకుంటే లేదు. ఇంతకీ వచ్చిన కలేమిటీ?" రేగిన పార్వతి ముంగురులు సవరిస్తూ అడిగాడు.

"చెడ్డదే. కాని కృష్ణా! ఫోర్జరీకి శిక్ష ఎంతుంటుందో?"

"మూడేళ్ళనుంచి ఏడేళ్లదాకా పడొచ్చు. ఇంతకీ ఎవరికో?" తనలోతనులా అన్నాడు.

"నీకు తెలుసు" అంది పార్వతి.

"అవును నాకు తెలుసు" అంటూ పార్వతిని చేతుల్లోకి తీసుకున్నాడు హాయిగా ఊపిరి వదుల్తూ. మళ్ళా కొన్నాళ్లు పార్వతి పేచీలు పెట్టదనే - ఆ హాయి.